




Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్






సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 51 | బుధవారం 16 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## రాష్ట్రానికి మరింత సహకారమివ్వండి

- ఏపీలో ఆర్థిక వనరుల కొరత
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- 'బనకచర్ల'కు అనుమతులివ్వాలని వినతి

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 15:**

ఆర్థిక వనరుల పరంగా ఆంధ్రప్రదేశ్ తీవ్ర కొరతతో ఇబ్బందులు పడుతోందని, ఈ నేపథ్యంలో మరింత సహకారం అందివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో..



# భూమిపైకి శుభాంశు శుక్లా

- అంతరిక్షం నుంచి కాలిఫోర్నియాలో సముద్రంలో దిగిన వ్యోమనౌక
- శుభాంశుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక
- 22 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత భూమిపైకి చేరిన నౌక
- ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు వ్యోమగాములు
- స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- స్వాగతించే వారిలో నేనూ చేరుతానని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- కోట్లాది మందికి శుభాంశు శుక్లా ప్రేరణను ఇచ్చారన్న మోదీ

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 15**

భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపిన అనంతరం 22 గంటల సుదీర్ఘ ప్రయాణం చేసి భూమిపై దిగారు. కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక దిగింది. వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు వారు భూమిని చేరారు. జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లిన శుభాంశు బృందం అక్కడ పలు కీలక పరిశోధనలు నిర్వహించింది. ఈ 18 రోజుల్లో వీరు దాదాపు 96.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. అంతరిక్షంలో ఉన్న సమయంలో ఈ బృందం 230 సూర్యోదయాలను చూసింది.

యాక్సియం-4 మిషన్ విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు శుక్లా సహా

- మిగతా 2లో..

## కర్ణాటక ఏరోస్పేస్ పార్కు భూ సేకరణ రద్దు

- రైతుల డిమాండ్లకు తలొగ్గిన సర్కార్
- ఫలించిన మూడేళ్ల పోరాటం
- అన్నదాతలకు ఎఐకెఎస్ అభినందనలు



**బెంగళూరు - సూర్య వాస్తవం, జూలై 15:**

మూడేళ్ళకు పైగా అకుంఠిత దీక్షతో, కృత నిశ్చయంతో రైతులు సాగించిన మహెూద్యమంతో కర్ణాటక ప్రభుత్వం దిగొచ్చింది. ఎన్ని బెదిరింపులు, అణచివేత చర్యలు చేపట్టినా వాటికి వెరవకుండా రైతులు కొనసాగించిన తీవ్ర వ్యతిరేకత, నిరసనల కారణంగా ఏరోస్పేస్ పార్క్ కోసం చేపట్టదలచిన వేలాది ఎకరాల భూ సేకరణ ప్రక్రియను ఉపసంహరించుకుంది. దేవనహళ్లి తాలుకాలోని 13 గ్రామాల్లో 1777 ఎకరాల భూమిని ఏరోస్పేస్ పార్కు నిర్మాణం కోసం సేకరించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. అయితే రైతులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతి ఘటించారు. తక్షణమే

- మిగతా 2లో..

# సీమకు జల సిరులు

- ఈ నెల 17న నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు
- హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపు
- శరవేగంగా పనులు పూర్తి
- 100 రోజుల్లోనే కాలువ విస్తరణ



**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 15**

హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపుతో రాయల సీమలో తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన నిర్ణయాలు, చూపిన చొరవ ఫలితంగా రాయలసీమకు జలసిరులు అందనున్నాయి. హంద్రీనీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు విజయవంతంగా పూర్తి కావడంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం అయ్యేందుకు మార్గం సుగమం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు

- మిగతా 2లో..



## జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

- భూసేకరణను అడ్డుకోవాలని వినతి
- కరేడు భూముల్లో సోలార్ పరిశ్రమ
- ఇటీవలే భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు

2లో

## రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకు..

- మంత్రి నారా లోకేశ్
- ఏపీలో రాబోయే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం
- సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి



**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 15**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని రాష్ట్ర

- మిగతా 2లో..

## మరణశిక్ష అమలు వాయిదా

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 15**



యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియకు చివరి నిముషంలో కాస్త ఊరట లభించింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. తొలుత నిర్ణయించిన ప్రకారం బుధవారం ఈ శిక్ష అమలు జరగాల్సి వుంది. "తొలినుండి నిమిష ప్రియకు అన్ని విధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి ఈ సమస్యను పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేందకు ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. ఫలితంగా మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకరిం చారు." అని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడిం చాయి. ఇదిలావుండగా, బ్లడ్ మనీ తీసుకుని కేసును ఉపసంహరించుకునేలా బాధిత కుటుం బాన్ని ఒప్పించేందుకు మత గురువు అబూబకర్ ముస్లియార్ జరుపుతున్న కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. బాధిత కుటుం బానికి మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.6 కోట్లు) ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# రాష్ట్రానికి మరింత సహకారమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, నిధులు విడుదల విషయాన్ని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా సహకరిం చాలని కోరారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, అయినప్పటికీ ఆర్థిక వనరుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్ర విభజన పర్యావసనంగా ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపులు చేసేలా చూడాలని, ఈ మేరకు 16వ ఆర్థిక సంఘానికి కూడా నివేదికలు అందజేశామని అమిత్ షాకు చంద్రబాబు తెలియజేశారు. కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకూ 200 టిఎంసిల వరద నీటిని తరలించేలా లింక్ ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు పూర్తి అయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను కూడా వివరించారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజుల మిగులు జలాలు ఉంటాయని తెలిపారు. నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఏపికి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గవర్నర్‌గా నియమించినందునకు కేంద్ర ప్రభుత్వానికి, అమిత్ షాకు, ప్రధాని నరేంద్ర మోడీకి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో నీతి ఆయోగ్ సభ్యులు వికె సారస్వత్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎరో స్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుపై సారస్వత్‌తో ముఖ్యమంత్రి చర్చించారు. రాయలసీమ ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని, ఈ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను, పెట్టుబడుల సాధనకు అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం సిఎం చంద్రబాబుని ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్ కలిశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో నిర్మాణంపై సహకారంపై చర్చించారు.

# భూమికి శుభాంశు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక కాలిఫోర్నియా సమీపంలోని సము ద్రంలో దిగింది. ఈ సందర్భంగా మోదీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను స్వాగతించే భారత ప్రజల్లో తాను కూడా ఒకడినని ఆయన పేర్కొన్నారు. శుభాంశు శుక్లా తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శక స్ఫూర్తి ద్వారా కోట్లాది మందికి ప్రేరణ ఇచ్చారని ప్రశంసించారు. ఇది భారత మానవ సహిత అంతరిక్ష మిషన్ గగన్‌యాన్ దిశగా మరో ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

ట విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ లక్ష్యాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, జీసీసీలు, డేటా సెంటర్ల స్థాపనకు ఇప్పటి వరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించగా, ఈ సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు.

ఇటీవలి బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని, వీటి ద్వారానే యువతకు 35,000 ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎంఓయూలు చేసుకున్న సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్‌లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

**త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం**

రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీంతో పాటు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌ల సేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్‌ల వినియోగంపై నెలకు ఒక జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

మనమిత్ర సేవలు మరింత సులభతరం

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలలో 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాష్ట్రంలోని 45,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి స్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్‌పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటీ అండ్ సీ స్పెషల్ సెక్రటరీ సుందర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఓ ప్రకార్ జైన్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ,

## కర్ణాటక ఏరోస్పేస్ పార్కు

# భూ సేకరణ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

భూ సేకరణను నిలిపివేయాలంటూ రైతులు ప్రారంభించిన నిరసలు మంగళవారానికి 1198వ రోజుకు చేరాయి. ఈ పరిస్థితుల్లో రైతుల డిమాండ్‌కు తలొగ్గుతున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. బెంగళూరులో రైతు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే ఈ ప్రాజెక్టు కోసం ఎవరైతే స్వచ్ఛందంగా తమ భూమిని ఇవ్వాలనకుంటున్నారో అటువంటి రైతుల నుండి భూమిని ప్రభుత్వం సేకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అధిక ధరలకు ఆ భూమిని కొనుగోలు చేయడమే కాకుండా, ఆ రైతులకు అభివృద్ధిపరిచిన భూమిలో కొంత భాగాన్ని ఇవ్వడం వంటి చర్యలు కూడా చేపడతామని ప్రకటించారు. ఈ ప్రతిపాదిత పార్కులో కొత్తగా ఫ్యాక్టరీలు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు ఇక్కడ అవకాశం లేకపోతే పొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయే అవకాశం వుందని అన్నారు. అయినప్పటికీ, తమ భూ ములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోరాదని గట్టిగా పట్టుబడుతున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఇక ఈ భూ సేకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తమ డిమాండ్ సాధన కోసం దేవనహల్లి తాలుకా రైతులు చన్నరాయపట్నాలో గత 1198 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ భూములన్నీ మంచి సాగుభూములని, పక్కనే బెంగళూరులోనే గల మార్కెట్లలో తమ పంటలకు మంచి గిట్టుబాటు ధర వస్తోందని, అటువంటి భూములను ఏరోస్పేస్ పార్కు కోసం ఎలా స్వాధీనం చేసుకుంటారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో సాగు భూముల స్వాధీనం చేసుకోవడంలో ఆంతర్యాన్ని వారు ప్రశ్నించారు.

రైతులు చేపట్టిన ఈ ఆందోళనలకు విస్తృతంగా మద్దతు లభించింది. వివిధ ప్రగతిశీల సంఘాలు తమ మద్దతును ప్రకటించాయి. తమ డిమాండ్లు పెడచెవిన పెడితే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ఇక ప్రభుత్వం మెట్టు దిగి రాక తప్పలేదు. జులై మొదటి వారంలో రైతు ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఇందులోని చట్టపరమైన సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు కొంత సమయం కావాలని కోరారు. చిట్టచివరిగా నిర్ణయాన్ని ఉపసంహరించు కుంటున్నట్లు మంగళవారం ప్రకటించారు.

**ఎఐకెఎస్ అభినందనలు**

సమైక్యంగా పోరాటం సాగించి ప్రభుత్వం వెనకడుగు వేసేలా, నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేసినందుకు కర్ణాటక రైతులు, వ్యవసాయ కార్మికులను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అభినందించింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడే రైతాంగ ఉద్యమానికి ఈ విజయం చాలా కీలకమైనదని వారు వ్యాఖ్యానించారు. భూములను తీసుకుని తమకివ్వాల్సిన నష్టపరిహారం సరిపోలేదు, ఇంకా ఎక్కువ ఇవ్వాలనే డిమాండ్లతో వీరు ఈ పోరాటం సాగించలేదని, వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం బలవంతంగా ఎలా స్వాధీనం చేసుకుంటారని వారు ప్రశ్నించారని, అందుకు వ్యతిరేకంగానే ఈ పోరాటం చేపట్టి విజయం సాధించారని అన్నారు. భారతదేశ వ్యాప్తంగా వేలాది ప్రాంతాల్లో ఇటువంటి తరహాలో సాగే పోరాటాలకు, ఉద్యమాలకు ఇది స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ఈ చారిత్రక పోరాటం గురించి, మహత్తర విజయాన్ని సాధించిన తీరు గురించి సమాచారంఅందరికీ తెలిసేలా ప్రచారం చేయాల్సిందిగా ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది. భవిష్యత్తులో సాగించే ఇటువంటి పోరాటాల్లో సంయుక్త హోరాటా కర్ణాటక, సంయుక్త కిసాన్ మోర్చాలకు మద్దతుగా ఎఐకెఎస్ నిలబడుతుందని వారు స్పష్టం చేశారు.

**పోరాటం రూపుదిద్దుకుందిలా**

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో బహుళ పంటలు పండే భూమిపై కార్పొరేట్ సంస్థలు కన్నేశాయి. అందుకు అనుగుణంగా గతంలోని బిజెపి ప్రభుత్వం ఆ భూములను కార్పొరేట్ సంస్థలు స్వాధీనం చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. దీని వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా, బిల్డర్లు వున్నారు. కానీ 13 గ్రామాల్లోరైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. సమైక్యంగా పోరు బాట పట్టారు. అయితే విభజించి పాలించు అన్న చందాన అందులో మూడు గ్రామాలను సేకరణ ప్రక్రియ నుండి పక్కకు పెట్టేస్తున్నట్లు ప్రకటించింది. అయినా రైతుల ఐక్యత చెక్కు చెదరలేదు. గత నెల 26న శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న రైతులపై పోలీసులు దారుణంగా లాఠీచార్జి చేశారు. అనేకమందిని అరెస్టు చేశారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. రచయితలు, కళాకారులు, పౌరసమాజ గ్రూపులు ఇలా అందరూ కలిసి రైతులకు సంఘీభావం ప్రకటించారు. ఇక గత్యంతరం లేక ముఖ్యమంత్రి, రైతులను చర్చలకు ఆహ్వానించారు. రైతులు పెద్ద ఎత్తున సాగించిన నిరసనల్లో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్‌తో సహా సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పలువురు కూడా పాల్గొన్నారు. కెపిఆర్ఎస్ నాయకత్వంతో పాటు సిఐటియు, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా సహా పలు సంఘాల నేతలు కీలక పాత్ర పోషించారు.

# సీమకు జల సిరులు



(మొదటిపేజీ తరువాయి)

మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వంద రోజుల్లోనే ఈ కాలువ విస్తరణ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసింది.

పరుగులు తీసిన ప్రాజెక్టు పనులు

రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు తాగు, సాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్-1, ఫేజ్-2 కాలువ పనులను పరుగులు పెట్టించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఫేజ్-1 కాలువ విస్తరణతో అదనంగా 1,600 క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఏర్పడింది. దీనితో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుంది.

12 ఏళ్ల తర్వాత 40 టీఎంసీల వినియోగం

మల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావడంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా రాయలసీమ జిల్లాల్లోని స్థానిక చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో కేవలం 1-2 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. ఇప్పుడు కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగడంతో, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40 టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలిగింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునే అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా ఏర్పడింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాలను తీర్చనుంది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1 ద్వారా నంద్యాల జిల్లాలో 2,906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది.

కూటమి ప్రభుత్వంతోనే మళ్లీ పనులు

2014-19 మధ్య రూ.4,317 కోట్లతో పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనులను 47 శాతం మేర పూర్తి చేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తయ్యాయి.

తదుపరి ఫేజ్-2 పనులను కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తం ప్రాజెక్టు కోసం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో రాయలసీమలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమై, ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఇది ఒక ముందడుగు అని చెప్పవచ్చు.

# జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

(మొదటిపేజీ తరువాయి)

**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 15**

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తమ సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను కలిశారు. సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతుల సమస్యలను సావధానంగా విన్న జగన్, అన్నదాతలకు వైసీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఇచ్చిన హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

కరేడు గ్రామ రైతులు గత కొంతకాలంగా తమ భూములను ఇండోసోల్ పరిశ్రమకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో వారు భగ్గుమన్నారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు జగన్ ను కలిశారు. జగన్ ను కలిసిన సమయంలో రైతుల వెంట కందుకూరు అసెంబ్లీ స్థానం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా ఉన్నారు.

ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. "రెండు మూడు నెలలుగా ఈ భూముల గురించి రైతులు పోరాడుతున్నారు. ఏడాదికి రెండు పంటలు పండే భూములు వారి నుంచి లాక్కునే ప్రయత్నం జరుగుతుంది. రైతులు తమ గోడు జగన్ గారిని కలిసి చెప్పుకున్నారు. ఇండోసోల్ కంపెనీకి మా ప్రభుత్వ హయాంలో మరో చోట భూములు కేటాయించాం. కానీ మేం కేటాయించిన చోట కాకుండా, ఇండోసోల్ కంపెనీకి ఈ కూటమి ప్రభుత్వం కరేడు వద్ద భూములు కేటాయించింది. దీనిని మేం వ్యతిరేకిస్తాం అని జగన్ గారు చెప్పారు. ఇది అన్యాయమన్నారు. రైతులను ఇబ్బంది పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సారవంతమైన భూములు రైతులకే చెందాలి కానీ, ఇలాంటి భూములు ఇవ్వకూడదన్నారు. సాగుకు నిరుపయోగం అయిన భూములు ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ గారు చెప్పారు" అని వివరించారు.

# సీనియర్లకు మళ్లీ ఆశలు



**కాకినాడ - సూర్య వాస్తవం**


డీపీ అతిపెద్ద రీజనల్ పార్టీ. పైగా బలహీనవర్గాలకు పెద్దపీట అనే నినాదంతో వచ్చిన ఆ పార్టీ..ఎందరో సామాన్యులను నాయకులుగా తయారు చేసింది. అలా నాలుగున్నర దశాబ్దాల టీడీపీ పార్టీలో..సీనియర్ మోస్ట్ లీడర్లు చాలా మందే ఉన్నారు. ఐదారుసార్లు మంత్రులుగా పనిచేసిన వారు..ఆరేడు సార్లు గెలిచిన వాళ్లు..సామాజిక వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సైకిల్ పార్టీకి బలమైన అనుభవమున్న నేతలు ఉన్నారు.అయితే గత ఎన్నికలకు ముందు పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని..రాబోయే 40ఏళ్లు పార్టీ స్ట్రాంగ్‌గా నిలబడేలా నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలనే ఆలోచనతో..చాలామంది జూనియర్లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఫస్ట్ టైమ్ గెలిచిన ఎమ్మెల్యేలను కూడా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడున్న క్యాబినెట్‌లో 18మంది కొత్త ముఖాలే. అయితే ఈ మధ్య మంత్రుల పనితీరుపై చాలా సీరియస్‌గా ఉన్నారు చంద్రబాబు.పనితీరు బాలేదని ముఖం మీదే చెప్పయడమే కాదు..మంత్రివర్గంలో మార్పులు, చేర్పులకు రెడీ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రావణమాసం రాగానే..క్యాబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఓ పోస్ట్‌ను భర్తీ చేయడంతో పాటు..నలుగురు, ఐదుగుర్ని తొలగించి వారి స్థానంలో కొత్తవాళ్లను తీసుకుంటారన్న ప్రచారం బయలుదేరింది.పనితీరు బాలేని జూనియర్లను క్యాబినెట్ నుంచి తప్పిస్తారన్న ఊహాగానాలతో..సీనియర్లలో ఆశలు చిగురిస్తున్నాయట. ఉత్తరాంధ్ర టు రాయలసీమ వరకు టీడీపీలో చాలా మంది సీనియర్లు మంత్రి పదవి మీద ఆశలు పెట్టుకున్నారట. అయితే 2024లో బెర్త్ దొరకక కాస్త మౌనంగానే ఉంటూ వస్తున్నారు. జిల్లాలను శాసించే సీనియర్ లీడర్లు కాస్త..సొంత నియోజకవర్గాలకే పరిమితం అవుతూ వస్తున్నారు. అంతేకాదు వైసీపీపై విమర్శల విషయంలో కూడా మంత్రులదే బాధ్యత అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారట.అయితే సీనియర్ల లీడర్లతో అధినాయకత్వం బాగానే ఉంటోంది. మంత్రివర్గంలోకి తీసుకోకపోయినా..పెద్ద పెద్ద పోస్టులు ఇవ్వకపోయినా..పార్టీ కోసమే కొత్త నీరు అన్నట్లుగానే చెబుతూ వస్తోంది. ప్రభుత్వంలో పెద్దగా అనుభవం కలిగినవారు లేకపోవడంతో ధాటిగా విపక్షాల విమర్శలను తిప్పికొట్టలేకపోతున్నారట. ఇప్పుడున్న మంత్రివర్గంలో ఇద్దరు సీనియర్ లీడర్లు రామానాయుడు, పయ్యావుల కేశవ్ పనితీరు మీద మాత్రమే సీఎం సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి విస్తరణలో మళ్లీ సీనియర్లనే తీసుకుంటారని..తమకు అవకాశం దక్కబోతుందని హోప్స్ పెట్టుకుంటున్నారట సీనియర్ టీడీపీ లీడర్లుసబ్జెక్ట్‌పై పట్టుండేవారు. విపక్షం నుంచి ఒక విమర్శ రాగానే అన్ని లెక్కలతో సహా ఇచ్చిపడేసేవాళ్లు. రాజకీయంగా దూకుడుగా ఉండేవారు అవసరమని భావిస్తున్నారట. ఇవన్నీ క్వాలిటీస్ ఉండాలంటే సీనియర్లుగా తమకే అవకాశం ఉంటుందనేది నేతల అంచనాలున్నాయట. ఈ క్రమంలోనే మంత్రివర్గంలో మార్పులు జరిగితే కనుక కచ్చితంగా సీనియర్లకు ధాటిగా మాట్లాడేవారికి కచ్చితంగా చోటు దక్కుతుందని ప్రచారం సాగుతోంది. దాంతో సీనియర్ లీడర్లలో ఫుల్ హుషార్ కనిపిస్తోందట.తమకు అమాత్య కిరీటలు దక్కే రోజు దగ్గరలోనే ఉందని ఊహల్లో తేలియాడుతున్నారట. మళ్లీ అధికారం చేపట్టాలంటే ప్రయోగాలను పక్కన పెట్టి..వైసీపీని కట్టడి చేసేందుకు సీనియర్లను రంగంలోకి దింపే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే కొత్తగా పాత ముఖాలను క్యాబినెట్‌లో చూసే రోజులు దగ్గరలోనే ఉండబోతున్నాయ్. అమాత్య పదవి దక్కే సీనియర్ లీడర్లు ఎవరో చూడాలి మరి.



# వైసీపీ ఓటమిపై చర్చలెప్పుడు...?

**ఒంగోలు - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే? జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారం లోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు.పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై




విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.. వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నర. కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతు న్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# కేసులు మీద కేసులు

**తిరుపతి - సూర్య వాస్తవం**



ప్రభుత్వ అండదండలతో రెచ్చిపోతారా?! విచ్చలవిడిగా కేసులు పెడతారా?! మీరు మాపై కేసు మీద కేసు రాస్తే? మేం తప్పక ఇస్తాం రివర్స్ డోసు అంటున్నారు వైసీపీ నేతలు. చట్టబద్ధంకాని కేసులను చట్టబద్ధంగానే తేల్చుకుంటామంటూ సవాల్ చేస్తున్నారు. ప్రైవేట్ కేసులు వేసి ఓవైపు ప్రభుత్వం, మరోవైపు అధికారుల పని పడతామంటున్నారు?! అసలింతకీ ఈ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? వాటి ఇంపాక్ట్ ఎలా ఉంటుంది?? ఇదే అంశం ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. మాజీ సీఎం జగన్ వరుస పర్యటనలపై రాజకీయ రచ్చ ఏరేంజ్‌లో అయితే నడుస్తోందో? కేసులు కూడా అదే స్థాయిలో నమోదవుతున్నాయి?! అంతకుముందు గుంటూరు, మొన్నామధ్య పల్నాడు, లేటెస్ట్‌గా బంగారుపాళ్యం పర్యటనపైనా కేసులు ఫైల్ అవ్వడం చర్చనీయాంశమైంది. జగన్ పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించడంతోపాటు పూర్తిగా ఆంక్షలు ఉల్లంఘిస్తున్నారంటూ కేసులు మీద కేసులు నమోదవుతున్నాయి. వైసీపీ కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు ఫైల్ అయ్యాయి. అంతేకాదు పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో సింగయ్యను జగన్ కారు ఢీకొట్టిందంటూ జగన్‌పైనా కేసు నమోదవ్వడంపై భగ్గుమన్న వైసీపీ నేతలు రివర్స్ ఎటాక్‌కి రెడీ అయిపోయారు.సంబంధం లేని వాళ్లందరిపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు? తప్పు ఎవరిదైనా తమ నేతలపైనే కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహిస్తున్నారు. అలాంటి వాటికి వైసీపీలో భయపడే వాళ్లు ఎవరూ లేరంటూనే? ప్రైవేట్ కేసులతో ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారుల పని పడతామంటున్నారు. ఇక కాస్కోండి అంటూ సవాల్ విసురుతున్నారు. తమపై కక్ష కట్టిన ఏ ఒక్కరిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.వైసీపీ నేతల మాటలతో అసలీ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? అవి వేస్తే ఏమవుతుందన్న అంశంపై చర్చ మొదలైంది. ప్రైవేటు కేసు వేయడం అంటే? ఒక వ్యక్తి నేరుగా కోర్టులో దాఖలు చేసే ఫిర్యాదు. సాధారణంగా, పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నిరాకరించినప్పుడు లేదా ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు బాధితులు నేరుగా కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత ఫిర్యాదు చేసిన వ్యక్తి మేజిస్ట్రేట్ ముందు హాజరై తన ఇబ్బందులేంటో చెప్పాల్సి ఉంటుంది. ప్రభుత్వాధికారులు ఎందుకు కేసు ఫైల్ చేయలేదో క్లారిటీ కూడా ఇవ్వాలి. ఇక ఇరువర్గాల వాదనల అనంతరం కోర్టు తీర్పునిస్తుంది. అయితే పక్కా ఆధారాలు, తమవైపు ఎలాంటి తప్పులేదనుకున్నప్పుడు మాత్రమే ఈ ప్రైవేట్ కేసులు వేయడానికి సిద్ధమవుతారు.

ఇప్పుడు వైసీపీ నేతలు కూడా మేం సిద్ధమంటున్నారు.మొత్తంగా? ప్రైవేట్ కేసులు వేసే విషయంలో వెనక్కి తగ్గేదేలే అంటున్నారు వైసీపీ నేతలు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వారికి చట్టబద్ధంగానే శిక్ష పడేలా చేస్తామంటున్నారు. మరీ వైసీపీ అన్నట్లుగానే ప్రైవేట్ కేసులు వేస్తుందా?? లేక మాటలతోనే సరిపెడుతుందా?? అన్నది తేలాంటే కాస్త ఆగాల్సిందే.

# త్వరలో పదవుల పండుగ...

**గుంటూరు - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు లేదా ఎల్లుండి పార్టీ నేతలకు గుడ్ న్యూస్ చెప్పే అవకాశముంది. ఈ నెల 15వ తేదీ ఉదయం చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఈలోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పటికే పలు మార్లు నామినేటెడ్ పోస్టులను ప్రకటించిన చంద్రబాబు మరోసారి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడానికి సిద్ధమవుతున్నారు. రేపు సాయంత్రం నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రకటన వెలువడే అవకాశముంది. ఇందుకోసం పార్టీ నేతలు కూడా కసరత్తులు చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఈ నెల 15వ తేదీలోగా నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన జాబితాను పంపాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు.



ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా... కేవలం నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పంపిన జాబితా మాత్రమే కాకుండా ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా కార్యకర్తల అభిప్రాయాన్ని కూడా సేకరించి నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నామినేటెడ పోస్టులు కూడా మూడు పార్టీలకు పంచేందుకు చంద్రబాబు జాబితాను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. టీడీపీకి ఇందులో ఎక్కువగా పోస్టులు దక్కనుండగా, ఆ తర్వాత జనసేన పార్టీకి, అనంతరం బీజేపీకి కూడా కొన్ని స్థానాలను కేటాయించనున్నారు. ఇప్పటికే జనసేన, బీజేపీల నుంచి కూడా నామినేటెడ పోస్టుల కోసం జాబితాను అడగ్గా వారు కొన్ని పేర్లను ఇచ్చినట్లు సమాచారం. గత ఎన్నికల్లో పదవులు దక్కని వారితో పాటు, పార్టీ విజయం కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారని చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి వచ్చి పేర్లను టీడీపీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో జాబితాను వడపోసి చంద్రబాబుకు అందచేసినట్లు సమాచారం. చంద్రబాబు వడపోత పట్టిన తర్వాత రేపు సాయంత్రం లేదా పదిహేనో తేదీ ఉదయం నామినేటెడ్ పోస్టులను ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళ్లే ముందు ఈజాబితాను ప్రకటిస్తారని తెలిసింది.

అందుకోసమే ఆయన ముఖ్యమైన నేతల పేర్లు మిస్ కాకుండా పార్టీ విజయం కోసం కష్టపడిన వారందరికీ పదవులు ఇవ్వనున్నారుప్రధానంగా రాష్ట్రంలో ఉన్న 2028 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 491 సొసైటీలకు ఛైర్మన్‌లతో పాటు 900 దేవాలయాలకు ఛైర్మన్లతో పాటు పాలకవర్గాన్ని కూడా నియమించాలి. మార్కెట్ కమిటీలను కూడా నియమించాల్సి ఉంది. అయితే అన్నింటినీ భర్తీ చేస్తారా? లేక వీటిలోకొన్నింటిని మాత్రమే భర్తీ చేసి మరికొన్నింటిని హోల్డ్ లో పెడతారా? అన్నది మా?రం తెలియరాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండటంతో నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేసి నేతలకు పదవులు ఇవ్వాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. దీంతో రేపో, మాపో టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపికబురు అందించే అవకాశాలున్నాయి.

# ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం

**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 15:** మండలంలోని 11వ ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఇంచార్జి హెడ్మాస్టర్ సమీర్ బాష తెలిపారు. బెటాలియన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవానికి ఇంచార్జి హెడ్మాస్టర్ సమీర్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనాటి విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే సరిపోదన్నారు. విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను కూడా పొందాలని, ఆటోమోటివ్ రిటైల్ వంటి ఒకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థులు చిన్న వయసులోనే ప్రాక్టికల్ నాలెడ్జ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్



సంపాదిస్తారన్నారు. రాబోవు రోజుల్లో ఏఐ, (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ), రోబోటిక్, డిజిటల్ టెక్నాలజీ కారణంగా వ్యాపారాలు, ఉద్యోగాలు మారిపోతు న్నాయ న్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి ఒక నైపుణ్యాన్ని నేర్చుకుని జీవనోపాధిని పటిష్టం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు యూనస్, రవి శంకర్, పోతులూరయ్య మాట్లాడుతూ చైనాలో తల్లి దండ్రులు తమ పిల్లలను మంచి నైపుణ్యాలతో పెంచు తారన్నారు. పది సంవత్సరాల వయసు వచ్చేటప్పటికి పిల్లలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే విధంగా వాళ్లను తీర్చిదిద్దుతారన్నారు. ఈ సందర్భంగా ఆటోమోటివ్ , రిటైల్ విద్యార్థులు తమ ప్రాజెక్టు, ప్రాక్టికల్ ప్రదర్శనలు చేసి నైపుణ్యాలను చాటి చూపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్స్ షేక్ మౌలాలి, హేమంత్, ఉపాధ్యాయులు రామ సుబ్బారెడ్డి, యూనస్, రవి శంకర్, సిరాజుల్లా, పోతు లూరయ్య, నరసింహులు, రమణయ్య రాజమ్మ, పరమేశ్వరి, సుమతి, సుజాత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అడ్డుపడుతూ మాపై విమర్శలా...?

- మేయర్ వసీంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం
- 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో సుపరిపాలన తొలి అడుగు
- నడిమివంక ప్రాంతం పరిశీలన, అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- నడమివంక ప్రొటెక్షన్ వాల్స్, బ్రిడ్జిల నిర్మాణం చేపడుతామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- తాము ఏ ప్రతిపాదనలు పంపినా.. మేయర్ అడ్డుకుంటున్నారన్న ఎమ్మెల్యే



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 15:** అనంతపురం నగరంలో తాము ఏ అభివృద్ధి పని చేయాలన్నా నగర మేయర్ వసీం అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆరోపించారు. 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నడిమి వంక ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నిర్మించాల్సిన ప్రొటెక్షన్ వాల్స్, బ్రిడ్జిల గురించి చర్చించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు, సరుకులు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పింఛన్ దారులతో మాట్లాడి ఇంటి వద్దకే పింఛన్ వస్తోందా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ -2 నాటికి డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా తరలిస్తామని పునరు ద్ఘాటించారు. నడిమి వంక, మరువ వంక ప్రొడక్షన్ వాల్స్, బ్రిడ్జి నిర్మాణాలు చేపడతామన్నారు. నేను ఎక్కడ అభివృద్ధి చేశానన్నది మేయర్ పదేపదే ప్రశ్నిస్తున్నారని అయితే ఎక్కడెక్కడ ఎంత మొత్తంలో ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నది పాంప్లెట్ పేపర్ వేసి వివరించామన్నారు. అయినా మేయర్‌కు అర్థమైనట్టు లేదన్నారు. మున్సిపాలిటీలో ఏ అభివృద్ధి పనులకు ప్రపోజల్ పెట్టినా అడ్డుకుంటున్నారన్నారు. 45 మంది కార్పొరేటర్లు ఉన్నారని.. కౌన్సిల్ తీర్మానం చేయాలంటూ దాటవేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆటంకాలను దాటుకుంటూ 118 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో అనంతపురం నగరం వైపు రాష్ట్రం మొత్తం చూసేలా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. మరోవైపు జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని వినాశనం చేసి పది లక్షల కోట్లు అప్పు పెట్టి పోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పూర్తిస్థాయిలో కష్టపడుతూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. వారిద్దరిపై ప్రజలతో పాటు పెట్టుబడిదారులకు కూడా నమ్మకం ఏర్పడిందన్నారు. అందుకే రాష్ట్రంలో ఏడాది కాలంలోనే 9.50 లక్షలు కోట్ల రూపాయల పెట్టుబడులు, 8.50లక్షలు ఉద్యోగాలు వచ్చాయన్నారు. అనంతపురం జిల్లాకు కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ నాయకులు, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, దలవాయి రమాదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుమహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, సరళ, మల్లెల దుర్గేష్, టిడిపి నాయకుడు రాయల్ మధు, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణి రవి, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, దలవాయి రమాదేవి, దాడి మల్లికార్జున, వడ్డే భవాని, వడ్డే వెంకటేష్, టైలర్ శీన, ఈడీగ నాగభూషణం, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో

# తెలుగు దేశం పార్టీ నాయకులు



**గుత్తి-సూర్యవాస్తవం,జులై 15:** గుత్తి పట్టణంలోని 17వ వార్డులో జరిగిన సూపరిపాలన తొలి అడుగులో భాగంగా డోర్ టు డోర్ కా ర్యక్రమంలో పాల్గొన్న తెలుగుదే శం పార్టీ జిల్లా అధ్యక్షులు కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ గుత్తి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్నిగుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాలు మేరకు తనయుడు గుత్తి,పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనల తో గుత్తి పట్టణం 17వ వార్డ్‌లో తెలుగుదేశం పార్టీ గుత్తి పట్టణ అ ధ్యక్షులు ఎంకె చౌదరి,గుత్తి ప్రభు త్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ ఆ ధ్వర్యంలో 17వ వార్డ్ లో సూపర్ పాలన తొలి అడుగులో భాగంగా డోర్ టు డోర్ తిరిగి కూటమి ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత అవ్వ తాతల పెన్షన్ 3000 నుంచి 4000 రూపాయలకు పెంచారు అలాగే మహిళా శక్తిలో భా గంగా మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల ను అందించారు తల్లికి వందనం లో భాగంగా ఇంటిలోఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లి కి వందనం పథకం లబ్ధి పొందిన తల్లిదండ్రులు మాట్లాడుతూ నా రా చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తె లిపారు ప్రభుత్వ స్కూళ్లలో మ ధ్యాహ్నం భోజనం పథకంలో భా గంగా సన్న బియ్యాన్ని ప్రవేశపె ట్టారు అలాగే వారు మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం రాబోయే రోజులలో అనేక పథకాలను ప్రవే శపెడుతుందని తెలియజేశారుఈ కార్ర్యమంలో 17 వార్డ్ ఇంచార్జ్ టైలర్ బాషా,ఎం.కె చౌదరి,రంగ స్వామి,రసూల్,చికెన్ సీన,సురేష్ గౌడ్ కొత్తపల్లి శేఖర్,నరసింహ యాదవ్,సుంకయ్య ఎన్టీఆర్,స్టీ ఫెన్,సుకేంద్ర,నారా యణస్వామి, 17వ వార్డు బూత్ ఇన్చార్జి మరి యు తెలుగుదేశం పార్టీ నాయకు లు కార్యకర్తలు పాల్గొనడం జరి గింది.

# ఆర్థిక సహాయం అందించిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి

**పామిడి- సూర్యవాస్తవం, జూలై 15:** పామిడి సంత మార్కెట్ వీధిలో ఉన్న కొండాపురం జయరాం, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మనోజ్ కుమార్ 7వ తరగతి చదవడానికి ఆర్థిక ఇబ్బందులు ఉండడం వల్ల ఎస్.అశోక్ కుమార్ యాదవ్‌కు ఆ విషయం తెలియజేయడం జరిగింది అశోక్ కుమార్ యాదవ్ ఆ విషయాన్ని మన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నరహరి తెలియజేయడం జరిగినది గంట నరహరి వెంటనే స్పందిస్తూ వారి అబ్బాయి చదువుకు సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు ఇవ్వడం జరిగినది దీనికిగాను కొండాపురం జయరాం దంపతులు మన వైసీపీ రాష్ట్రకార్యదర్శి శ్రీ గంట నరహరి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్ యాదవ్, చిరంజీవి, పామిడి మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, హరిబాబు, సిరిపురం మధు, సికిందర్,రామాంజినమ్మ,వైసీపీ నాయకురాలు పాల్గొనడం జరిగినది.



# గుత్తి సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుత్తి టీడీపీ నాయకులు

**గుత్తి-సూర్యవాస్తవం,జులై 15:** గుత్తి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఎంకె చౌదరి,గుత్తి ప్ర భుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ ఆధ్వర్యంలో గుత్తి సబ్ ఇన్స్పెక్టర్‌గా నిధులు నిర్వ హిస్తున్నటువం టి.సురేష్ జన్మదిన వేడుకలను



ముందుగా వారికి శాలువా కప్పి పూలదండ వేసి కేక్ కటింగ్ చేసి జన్మదిన శభాకాంక్షలు తెలిపారు వారు మాట్లాడుతూ మీరు ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని మీకు మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని దేవుని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గుంతకల్లు నియోజకవర్గం ఐటీ డీపి ప్రధాన కార్యదర్శి సురేంద్ర యాదవ్ (సూరి) షేక్ దాదా ఖలం దర్,బేతపల్లి భాస్కర్,మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కా ర్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## మామడురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఛైర్మన్‌గా, ఒసింగల్ విండో

# ప్రెసిడెంట్‌గా పాటిల్ సురేష్

**గుత్తి-సూర్య వాస్తవం,జులై 15:** గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్య క్షుడు పాటిల్ సురేష్‌ని మామడురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్‌గా సింగల్ విండో ప్రసిడెంట్‌గా ఎన్ని కైన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు ఈ ఎన్నికకు ఆధ్యుడు సామాన్య యువకులను రాజకీయ నాయకులుగా తీర్చిది ద్దినటువంటి జనసేన పార్టీ అధి నేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమం త్రివర్యులు కొణిదెల



పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు ముఖ్యంగా ఎన్డీఏ కూటమి భాగ స్వామ్యంలో అగ్రజులు భారత ప్రధాని నరేంద్ర మోడీకి, విజనరీ నేత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి ధన్యవాదా లు స్థానికంగా పొత్తు ధర్మం పాటి స్తూ ఈ ఎన్నికకు సహకరించిన టువంటి గుంతకల్ శాసనసభ్యు లు గుమ్మనూరు జయరాంకి అ నంత జిల్లా జనసేన పార్టీ అధ్యక్షు డు అహుడా చైర్మన్ టి.సి వరుణ్‌కి గుంతకల్ నియోజకవర్గం జన సేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠకి ప్రత్యేక కృతజ్ఞతలు.

# వన్యప్రాణుల వేటగాడు అరెస్ట్

- మరో ఇద్దరు పరార్
- ఒక ద్విచక్ర వాహనం, కత్తులు, టార్చ్ లైట్ స్వాధీనం
- సిద్దవటం రేంజర్ బి కళావతి



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 15:** సిద్ధవటం రేంజ్ పరిధిలోని అట్లూరు మండలం చెల్లంగారి పల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అభయారణ్యంలో ముగ్గురు వ్యక్తులు వన్యప్రాణులను వేటాడిన కేసులో గోపవరం మండలం వెంకట రామాపురం గ్రామానికి చెందిన బొడిమిగుంట రమణయ్య ను సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు సిద్దవటం రేంజర్ బి కళావతి తెలిపారు. స్థానిక అటివీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ తమకు సమాచారం రావడంతో అటవీ సిబ్బందితో వెళ్లి పెనుసిల లక్ష్మీ నరసింహ అభయారణ్యంలో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ గాలింపు చర్యల్లో వన్యప్రాణి అయిన కొండ గొర్రెను ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో వేటాడి చంపేశారన్నారు. కొండ గొర్రె మాంసాన్ని పెద్ద మొత్తంలో విక్రయించడానికి ప్రక్కన పెట్టుకుని, మరియు కొంత మాంసాన్ని అడవిలో వండుకొని తింటుండగా సోమవారం రాత్రి దాడులు చేశామన్నారు. ఈ దాడిలో రమణయ్యను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారన్నారు. పారిపోయిన వారిలో అట్లూరు మండలం చెల్లంగారి పల్లి గ్రామానికి చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శీను ఉన్నారన్నారు. వారి కోసం సిద్ధవటం, అట్లూరు, భాకరాపేట, బద్వేలు తో పాటుగా పలు గ్రామాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేరకు 6 వన్యప్రాణుల కాళ్లు, వండిన మాంసం, కత్తులు, టార్చి లైట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ నిందితుడిని సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించి సిద్ధవటం కోర్టులో హాజరు పరిచామన్నారు. వన్యప్రాణులు వేటాడినా, హాని తలపెట్టిన చట్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని ప్రతి ఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణ కొరకు పాటుపడాలని రేంజర్ తెలిపారు.

# కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 15:** కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె రూరల్ మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చీకలబైలు చెక్




పోస్ట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి నడుచుకొని వెళ్తుండగా బెంగళూరు వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎవరన్నది తెలియ రాలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎట్టకేలకు గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ, కంప్యూటర్ ఆపరేటర్లు సస్పెన్షన్



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 15:** అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి.సాంబ శివయ్యను, కంప్యూటర్ ఆపరేటర్లు ను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని, ఉన్నతాధి కారుల అనుమతి లేకుండా జిల్లా కేంద్రం వదిలి వెళ్లకూడదని ఉత్త ర్వుల్లో పేర్కొన్నారు.గతంలో ఆయనపైన వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది .వైసీపీ ప్రభుత్వం నుంచి జిల్లా ఇన్చార్జ్ గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్గా సాంబశివయ్య విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లోనే ఈయ నపైన అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనూ ఎటువంటి చర్యలు లేవు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన పై సస్పెన్షన్ వేటు వేసింది. ఇతడితో పాటు చిత్తూరు ఇన్ చార్జ్ పీడీ గోపాలా నాయక్పైనా సస్పెన్స్ న్ వేటు పడింది. రాయచోటి గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు గురుప్రసాద్, మహ్మద్ రఫీ, సుధాకర్లను కూడా సస్పెండు చేయడం జరిగింది.

## గుత్తి ఎస్ఐ సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు శ్రీనివాస్ యాదవ్



**గుత్తి-సూర్యవాస్తవం,జులై 15 :** గుత్తి మండలం వన్నేదొడ్డి తెలు గుదేశం పార్టీ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్ గుత్తి సబ్ ఇన్స్పెక్టర్‌గా నిధులు నిర్వహిస్తున్న సురేష్ జన్మదిన వేడుకలను ముందుగా వారికి శాలువా కప్పి పూలదండ వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మీరు ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని మీకు మంచి ఆయురా రోగ్యాలు ఇవ్వాలని పుట్టినరోజు శు భా కాంక్షలు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ సాయిబాబా ఆశీస్సులు మీ కుటుం బానికి ఎల్లవేళలా ఉండాలని మ నస్ఫూర్తిగా కోరుకుంటూ దేవుని కోరుకుంటున్నాను.

## రైతులు మినుములు సాగు చేయండి:డిఎఓ



**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 15:** రైతులు ఉద్యాన పంటలలో అంతర పంటలు సాగు చేయడం వలన అధిక దిగులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.రాప్తాడు మండల పరిధిలోని మరూరు హంపాపురం రైతు సేవ కేంద్రాల్లో నందు పొలం పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించారు.జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ... ఉద్యాన పంటలలో మినుములు అంతర పంటగా సాగు చేయడం వలన అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కౌలు చేసే రైతులు కౌలు కార్డులు చేయించుకోవాలి అని అన్నారు.అన్నదాత సుఖీభవ సంబంధించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య ఏఈఓ రంజిత రాణి విహెచ్ఎ పేర్సి ఎంపీఈఓ రాధ పద్మ రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 15:** ఆర్టీసీ బస్సు ఢీకొని దివ్యాంగుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, బురకాయల కోటకు చెందిన గోవిందు, లక్ష్మీదేవి దంపతుల దివ్యాంగ కుమారుడు మల్లికార్జున (25) మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ లో భిక్షాటన చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఈ క్రమంలో ఏదో పనిమీద మదనపల్లె పట్టణం, కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వరకు చేరుకున్నాడు.

అక్కడ రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా, మదనపల్లె నుంచి గాలివీడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్ టౌన్ ఎస్ఐ శివకుమార్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం స్థానిక ప్రభుత్వా సుపత్రిలోని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




# నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి

**- జాబ్ మేళాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**




**అనంతపురం కలెక్టరేట్ -సూర్య వాస్తవం, జులై 15 :** జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జాబ్ మేళాల నిర్వహణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకి సంబంధించి మూడు నెలల్లో 8 జాబ్ మేళాలను నిర్వహించాల్సి ఉందని, వాటిని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌కు సంబంధించిన కార్యచరణను చేప ట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగం కావాలని అడుగు తున్నారని, వారికి ఎక్కడో ఒకచోట ప్రైవేట్, ఔట్సోర్సింగ్ లేదా ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించేలా చూడాలని ఉపాధి కల్పనా కార్యాలయం అధికారులను ఆదేశించారు. ప్రతినెల ప్లేస్మెంట్ రిపోర్ట్ అందజేయాలని సూచించారు. డిగ్రీ కళాశాలల్లో స్కిల్ హబ్స్‌ని ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించాలని, ఆగస్టు నాటికి వాటిని సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేయనుండగా, ఆ సెంటర్‌ను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, ఇందుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు.

**జాబ్ మేళా క్యాలెండర్ పోస్టర్ల ఆవిష్కరణ :** అనంతరం 2025 - 26 సంవత్సరంలో రెండవ క్వార్టర్ జాబ్ మేళా క్యాలెండర్‌కి సంబంధించిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి జులై 18వ తేదీన, రాప్తాడు నియో జకవర్గానికి సంబంధించి జులై 28వ తేదీన, అనంతపురం అర్బన్ కి సంబంధించి ఆగస్టు 1వ తేదీన, గుంతకల్లు నియోజకవర్గం సంబంధించి ఆగస్టు 16వ తేదీన, రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి ఆగస్టు 29వ తేదీన, సింగనమల నియోజకవర్గానికి సంబంధించి సెప్టెంబర్ 12వ తేదీన, తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి సెప్టెంబర్ 19వ తేదీన, ఉరవకొండ నియోజకవర్గంకు సంబంధించి సెప్టెంబర్ 27వ తేదీన జాబ్ మేళాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ప్రజా వేదికలో జాబ్ మేళాను 18వ తేదీన ఉదయం 09:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. ఇందుకు సంబంధించి జాబ్ మేళా క్యాలెండర్ పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జాబ్ మేళాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పిడి శైలజ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జిల్లాపరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముకుద, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, బిసి కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జేఎన్టీయూ టిపిఓ శ్రీనివాసులు,ఎస్కేయు అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, మెప్మా డివైఎస్ఓ పద్మావతి, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు కృత్రిమ మేధ పై నైపుణ్యాలు ఘడించాలి

**- జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.సుబ్రమణ్యం ఉద్బోధ**




**రాయచోటి-సూర్య వాస్తవం, జులై 15:**ప్రస్తుత ప్రపంచములో, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు, కృత్రిమ మేధ నైపుణ్యాన్ని గడించాల్సిన అవసరము ఎంతైనా వుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.సుబ్రమణ్యం అన్నారు. ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవము సందర్భంగా, సమగ్ర శిక్షా ఆధ్వర్యములో, స్థానిక ప్రభుత్వ డైట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డైట్ పాఠశాలలో 9 , 10వ తరగతి విద్యార్థులకు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వృత్తి విద్య శిక్షణ అందుబాటులో ఉందని, ప్రభుత్వం నిష్ణాతులైన ట్రైనర్లను అందుబాటులో వుంచిదన్నారు.

పాఠ్యాంశాలకు అదనంగా చిన్నప్పటి నుండి వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా జీవితములో త్వరగా స్థిర పడవచ్చు అని, అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా వృత్తి విద్య పై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. నైపుణ్య దినోత్సవాన్ని పురస్క రించు కుని, పాఠశాలలో అందుబాటులో వున్న వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, విద్యార్థి సమూ హాలతో కూడిన రోల్ ప్లే నిర్వహించడంజరిగింది.

' మై ట్రేడ్ - మై డ్రీమ్ ' పేరుతో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, కేస్ స్టడీస్ మరియు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో ఏర్పాటు చేసిన కెరీర్ పాత్ చార్ట్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు నిర్మలా దేవి, సమగ్ర శిక్షా సియంఓ కరుణాకర్, ఏపీవో చంద్ర శేఖర్, జిల్లా వొకేషనల్ కో- ఆర్డినేటర్ యోగేష్ కుమార్ రెడ్డి, పాఠశాల వొకేషనల్ ట్రైనర్లు మహబూబ్ భాషా, రామాంజినేయులు, ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులు మహమ్మద్ ఖలీద్, ఉపాధ్యాయులు ఫణీంద్ర పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలుపై

# ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు మానిటర్ చేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జులై 15 :** శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, డిఈలు, ఏఈలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల్లో ఇతర త్రాగునీటి పథకాలతో పాటు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలును కూడా ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈలు బాధ్యతగా పర్యవేక్షణ చేయాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం క్రింద 3.83 కోట్ల రూపాయల డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్ లో జమ కావడం జరిగిందని, ప్రభుత్వం నుంచి డబ్బులు రావడంతో కార్మికులు వెంటనే విధుల్లోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చోట్లకి శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం నీరు వెళ్లేలా చూడాలన్నారు. కింది స్థాయిలో ఎవరు ఉన్నా లేకున్నా పథకాలు అమలు జరిగేలా, కొనసాగేలా చూడాలని, త్రాగునీటి పథకం ఆపేస్తాము అంటే కుదరదన్నారు. పంప్ హౌస్ లో, పైప్లైన్లలో నీళ్లు లేకపోతే అవి పగిలిపోయే అవకాశాలు ఉన్నాయని, పైపులు పగిలిపోతే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా రెగ్యులర్ వారిని పిలిపించి పనులు చేసేలా చూడాల్సిన బాధ్యతను ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు తీసుకోవాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ప్రతిరోజూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఆయా పంప్ హౌస్‌లలో సిసిటీవీ కెమె రాలను ఏర్పాటు చేయాలని, వచ్చే శనివారం నాటికి వాటిని ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల ఫీడ్ స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కూడా అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ సురేష్, డిఈలు శిరీష, శ్రీనివాస్, ఏఈలు సురేంద్ర ప్రసాద్, శ్రీనివాసకుమార్, శివకృష్ణ, హరికృష్ణనాయక్, ధనుంజయ్, కార్యాలయం ఎస్ఈ పిఏ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి ఆలయంలో

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





**తిరుమల-సూర్యవాస్తవం,జూలై 15:** తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి ఈవో జెశ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ,, సంవత్సరంలో నాలుగుసార్లు అనగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. కాగా, స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, నరేష్ కుమార్, శాంతా రామ్, సదా శివరావు, జంగా కృష్ణ మూర్తి, జానకి దేవి, మహేందర్ రెడ్డి, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఐపీఎస్ ఆదేశాలతో జిల్లాలో వాహనాల తనిఖీలు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 15:** అన్నమయ్య జిల్లాలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్‌లు చేపట్టారు. రోడ్లపై ఆక తాయిలు మహిళల పట్ల ఎవరైనా ఈవిటీజింగ్, చేసేవారిపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధా నంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు. హెల్మెట్/ సీట్ బెల్టు ధరించాలని, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనాల పైన ఎవరు కూర్చోరాదని హెచ్చరించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమా దాలు జరగకుండా పోలీసులు పలు జాగ్రత్తలు సూచనలు చేశారు.

## సహకార సంగం బ్యాంకు చైర్మన్‌గా బొల్లు శ్రీనివాస రెడ్డి



**పామిడి- సూర్య వాస్తవం, జులై 15:** గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి బొల్లు శ్రీనివాస రెడ్డి ని పి. కొత్తపల్లి సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమిస్తూ టీడీపీ కేంద్ర కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈసందర్భంగా బొల్లు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నా ఈ చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు గుత్తి మరియు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కి పామిడి పట్టణ మరియు మండల టీడీపీ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. తనమీద నమ్మకం ఉంచి ఈ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ఈ పదవికి న్యాయం చేస్తానని ఎల్లపుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని బొల్లు శ్రీనివాస రెడ్డి గారు తెలిపారు.

## గణితం పట్ల భయాన్ని పోగొట్టాలి

**- విద్యార్థులకు ఆసక్తికరంగా, అర్థమయ్యేలా బోధించాలి**

**- గణితం క్లబ్ ప్రారంభం సందర్భంగా డీఈవో సుబ్రహ్మణ్యం వెల్లడి**




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 15:** గణితం పట్ల విద్యార్థులకు ఉండే భయాలను పోగొట్టడానికి గణితం క్లబ్బులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మధ్యాహ్నం డైట్ అధ్యాపకులు శివ భాస్కర్, కేదార్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఆసక్తికరంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించడానికి నూతన విధానాలను గణిత ఉపాధ్యాయులు అనుసరించాలన్నారు. ఇందుకు గణిత ఆటలు, పజిల్స్, క్విజ్‌లు వంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమస్య పరిష్కార నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థులలో పెంపొందించాలన్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు మాట్లాడుతూ డైట్ ఒక ప్రయోగశాలగా బోధనాభ్యసనలో వినూత్న విధానాలను రూపొందించడం జరుగుతూ ఉందన్నారు. మెరుగైన ఫలితాల సాధన దిశగా డైట్ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్, ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ బాబు, అధ్యాపకులు వెంకట సుబ్బారెడ్డి, వైసీ రెడ్డిప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురిసి ... ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 15:** వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని మహిళలు గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. పత్తికొండ పట్టణంలో స్థానిక కుమ్మరి వీధిలో స్థానికులు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి గంగా జలాలతో జలాభిషేకం నిర్వహించి బోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతలైన పెద్దమ్మ అవ్వ, సుంకులమ్మ అవ్వ, మారెమ్మ అవ్వ , సవరమ్మ లను వేడుకుంటూ సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడు కోవనీదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. అందరూ బాగుండాలని మొక్కు కున్నారు.

## ఎల్లమ్మ జాతరకు పోలీసుల పటిష్ట బందోబస్తు

**- డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ గంటా సుబ్బారావు నిరంతర నిఘా**



**ఆదోని - సూర్య వాస్తవం, జూలై 15:** ఆదోని పట్నంలో మంగళవారం నాడు ఎల్లమ్మ తల్లి జాతరకు పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లుచేసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఈ జాతరకు డీఎస్పీ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకొంటూ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్టు ఆదోని పట్టణ ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు తెలిపారు.. ఈ జాతర మూడవ మంగళవారం సందర్భంగా ఆదోనిలోని ప్రజలే కాకుండా చుట్టుపక్కల ఉన్న వందల మంది భక్తులు వచ్చి బోనాలు సమర్పిం చుకుంటారని అందుకనీ ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసుకుంటూ గస్తీ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీనివాస్ భవన్ నుండి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా దుబ్బ గణపతి ,వీరభద్ర స్వామి ఆలయం , కోట ఆంజనేయ స్వామి ఆలయం, చెరువు కట్ట , రాణా మండల వై జంక్షన్ దర్గా పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని మార్గాల్లోనూ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించారు.

## విద్యుత్ కష్టాలు వైసీపీ పుణ్యమే

**- మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ఎద్దేవా**

**శాంతి పురం -సూర్య వాస్తవం, జూలై 15:** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించారని మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు గౌని వారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రసక్తి లేదని రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను వైసీపీ ప్రభు త్వం సర్వనాశనం చేసిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ శాఖపై వైసీపీ ప్రభుత్వం రూ.1.3 లక్షల కోట్లకు పైగా భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సోలార్ ఎనర్జీ 7వేల మెగావాట్ల ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. రాయల సీమలో గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులను తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాయల సీమలో పెట్టుబడులు రావడం కారణంగా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పన జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వినియోగిం చుకోవాలని కోరారు. సబ్‌స్టేషన్ల నిర్మాణం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో లో-ఓల్టేజీ సమస్యలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉందన్నారు. రైతాంగానికి పగటిపూటనే 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని,గృహాలకు, పరిశ్రమలకు 24 గంటల విద్యుత సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

## ఘనంగా ఎస్సై సురేష్ జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలియజేసిన జర్నలిస్టులు**



**గుత్తి -సూర్య వాస్తవం,జూలై 15:** గుత్తి ఎస్సైగా విధులు నిర్వహిస్తు న్న సురేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు గుత్తి జర్నలిస్టులు. మంగళ వారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్లో సురేష్ ను కలిసి శాలువా కప్పి పూలదండ వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాయితీకి మారుపేరైన సురేష్ ఇంకా ఉన్నత స్థాయికు ఎదగాలని ఆకాంక్షించారు.

## కుటుంబ సమస్యలతో డ్రైవర్ ఆత్మహత్య

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 15:** కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం, రామాపురంకు చెందిన చౌడప్ప (30) గత కొన్ని ఏళ్లుగా బి. కొత్తకోట మండలం కనికలతోపులో నివాసముంటూ అక్కడే నీళ్ల ట్యాంకర్ తోలుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఇతనికి భార్య కనకలక్ష్మి, కుమారుడు దేవాన్ష్ ఉన్నారు. కాగా చౌడప్ప మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ భార్య, కుమారున్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఘర్షణ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన చౌడప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆసుపత్రి కి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## విజయ్ సేతుపతి, నేను జీవితంలో మళ్లీ కలిసి పనిచేయకూడదని నిర్ణయించుకున్నాం

**- దర్శకుడు పాండిరాజ్**
**- విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా 'తలైవన్ తలైవి'**

జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ తమిళ దర్శకుడు పాండిరాజ్, విలక్షణ నటుడు విజయ్ సేతుపతి కలిసి పనిచేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వారి కొత్త సినిమా 'తలైవన్ తలైవి' జూలై 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపొం దుతోంది, ఇందులో నిత్యా మీనన్ కథానాయికగా నటస్తున్నారు. గతంలో, దర్శకుడు పాండిరాజ్, నటుడు విజయ్ సేతుపతి మధ్య కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయి. తాజాగా తలైవన్ తలైవి సినిమా ఈవెంట్ లో దర్శకుడు పాండిరాజ్ మాట్లాడారు. ఆ విభేదాల కారణంగా, జీవితంలో మళ్లీ ఇంకెప్పుడూ కలిసి పనిచేయకూడదని తామిద్దరం నిర్ణయించుకున్నామని పాండిరాజ్ వెల్లడించారు.

అయితే, ఈ నిర్ణయం ఊహించని విధంగా మారిపోయిందని అన్నారు. ప్రముఖ దర్శకుడు మిష్కిన్ పుట్టినరోజు పార్టీలో తామిద్దరం మళ్లీ కలుసు కున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, విజయ్ సేతుపతి స్వయంగా కలిసి, "మనం కలిసి ఒక సినిమా చేద్దాం" అని ప్రతిపాదించారని వెల్లడించారు. ఆ సమయంలో తామిద్దరి మధ్య నెలకొన్న దూరం తొలగిపోయి, కొత్త ప్రయాణానికి బీజం పడిందని వివరించారు. మిష్కిన్ పార్టీలో జరిగిన సంభాషణ తర్వాత, పాండిరాజ్ 'తలైవన్ తలైవి' సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ కథానాయకుడి పాత్రకు విజయ్ సేతుపతి అత్యంత సరైన ఎంపిక అని ఆయన బలంగా విశ్వసించారు. కథ పూర్తయిన తర్వాత, పాండిరాజ్ విజయ్ సేతుపతికి కేవలం 20 నిమిషాల పాటు కథను వివరించారట. కథను విన్న వెంటనే, సేతుపతి ఏ మాత్రం సంకోచం లేకుండా ఈ చిత్రంలో నటించడానికి అంగీకరించారు. 'తలైవన్ తలైవి' చిత్రంలో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. సత్య జ్యోతి ఫిలిమ్స్ పతాకంపై ఈ సినిమా నిర్మితమైంది. ఇది కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా రూపొందించబడింది. వేసవి సెలవుల అనంతరం జూలై 25న ఈ సినిమా విడుదల కానుండటంతో, విజయ్ సేతుపతి అభిమానులు, సాధారణ ప్రేక్షకులు సినిమా కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి.

## అందుకే పుకార్లను నమ్మరాదు: నిధి అగర్వాల్

**- 'హరిహర వీరమల్లుకు' పవన్ చాలా సమయాన్ని కేటాయించారన్న నిధి**
**- సినిమా కోసం పవన్ చాలా కష్టపడ్డారని ప్రశంస**
**- ఈ నెల 20న వైజాగ్ లో ప్రీరిలీజ్ ఈవెంట్**



ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం 'హరిహర వీరమల్లు' సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతోంది. ఈ క్రమంలో, హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రమోషన్లలో పాల్గొంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిధి మాట్లాడుతూ,,, ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమా షూటింగ్ చాలా టైమ్ తీసుకుందని కొందరు అంటున్నారని... పవన్ కల్యాణ్ పాలిటిక్స్ లో ఉంటూనే సినిమాకు చాలా సమయాన్ని కేటాయించారని చెప్పింది. ఆయన ఎంతో కష్టపడ్డారని తెలిపింది. మూవీకి అంత సీన్ లేదని, అందుకే లేట్ అవుతోందని కామెంట్స్ వచ్చాయని... ట్రైలర్ వచ్చాక వాటికి చెక్ పడిందని నిధి వ్యాఖ్యానించింది. సినిమా అద్భుతంగా ఉందనే కామెంట్లు ఇప్పుడు వస్తున్నాయని... అందుకే పుకార్లను నమ్మరాదని చెప్పింది. మరోవైపు ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ఈ నెల 20న వైజాగ్ లో నిర్వహించనున్నారు.

## ఫ్లాపులలోను పారితోషికాన్ని పరిగెత్తిస్తున్న శ్రీలీల!

**- శ్రీలీల తాజా చిత్రంగా 'జూనియర్'**
**- కన్నడలో రూపొందిన సినిమా**
**- ఈ నెల 18వ తేదీన సినిమా విడుదల**
**- హీరోగా గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు పరిచయం**
**- సినిమా భారమంతా శ్రీలీలపైనే**



తెలుగు తెరపై శ్రీలీల రాకెట్ వేగంతో దూసుకొచ్చింది. పూజ హెగ్డే .. రష్మిక .. కీర్తి సురేశ్ జోరు ఇక్కడ కొనసాగుతూ ఉండగానే శ్రీ లీల ఎంట్రీ ఇచ్చింది. వరుస అవకాశాలతో దూసుపోయింది. ఒకానొక దశలో ఎక్కడ చూసినా ఆమె సినిమా షూటింగులే కనిపించాయి. ఆ స్థాయిలో ఈ మధ్య కాలంలో జోరు చూపించిన కథానాయికలు ఎవరూ లేరనే చెప్పాలి. స్టార్ హీరోల సరసన సందడి చేస్తున్న ఈ బ్యూటీ ఇప్పుడు ఓ కొత్త హీరో జోడీ కడుతోంది. ఆ సినిమా పేరే 'జూనియర్'. 'జూనియర్' .. యూత్ ను టచ్ చేస్తూ సాగే ఫ్యామిలీ డ్రామా. గాలి జనార్ధనరెడ్డి తనయుడు కిరీటీ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో, అతని జోడీగా శ్రీలీల ఆడిపాడనుంది. కీలకమైన పాత్రలో జెనీలియా కనిపించనుంది. రాధాకృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాను, ఈ నెల 18వ తేదీన విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించిన ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. ఈ సినిమా కోసం శ్రీలీల భారీ పారితోషికం తీసుకుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.శ్రీలీల ఖాతాలో భారీ హిట్లు ఉన్నాయి. వాటి సంఖ్య తక్కువే అయినా అవి చూపించిన ప్రభావం ఎక్కువ. కొంతకాలంగా శ్రీలీలకు పెద్ద హిట్లు లేవు. అలాగని చెప్పి ఆమె క్రేజ్ ఏమీ తగ్గలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు .. తమిళ .. హిందీ సినిమాలు ఉన్నాయి.

అలాంటి ఆమె ఒక కొత్త హీరో జోడీగా ఓకే చేయడమంటే రిస్క్ తో కూడిన వ్యవహారమే. కథా భారమంతా ఆమెనే మోయవలసి ఉంటుంది. అందువల్లనే భారీ మొత్తాన్నే పారితోషికంగా తీసుకుందనే టాక్ వినిపిస్తోంది. ఆమె అత్యధిక పారితోషికం అందుకున్న సినిమా ఇదేనని అంటున్నారు. మరి ఈ సినిమా శ్రీలీలకి పారితోషికం మాత్రమే మిగిలేలా చేస్తుందా? సక్సెస్ ను కూడా తీసుకొస్తుందా? అనేది చూడాలి.






## 27 పరుగులకే విండీస్ ధమాల్

**- టెస్టుల్లో మరో చెత్త రికార్డు**
**- సిరీస్ 3-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్**

**కింగ్‌స్టన్(జమైకా):** కరేబియన్ గడ్డపై ఆస్ట్రేలియా బౌలర్లు సత్తా చాటారు. మూడో, చివరి టెస్ట్‌లోనూ వెస్టిండీస్‌పై 176పరుగుల తేడాతో నెగ్గిన ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేయగా.. 204పరుగుల ఛేదనలో భాగంగా వెస్టిండీస్ జట్టు 27 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ స్టార్క్ (6/9) సంచలన బౌలింగ్‌తో కరేబియన్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు.

అతనికి తోడుగా స్కాట్ బోలాండ్ (3/2) హ్యాట్రిక్‌తో మెరవడంతో విండీస్ పేకమేడలా కుప్పకూలింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోరు. స్టార్క్ తన మొదటి ఓవర్‌లో మూడు వికెట్లు తీశాడు. మొత్తంగా 15 బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లోనే ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా స్టార్క్ రికార్డు సృష్టించాడు. విండీస్ బ్యాటర్లలో ఏడుగురు డకౌటయ్యారు. జస్టిన్ గ్రీవ్స్(11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ స్టార్క్‌కు దక్కింది. 87 బంతుల్లోనే 10 వికెట్లు కోల్పోయిన కరేబియన్ జట్టు తక్కువ బాల్స్‌లో ఆలౌటైన మూడో జట్టుగా చెత్త రికార్డు మూటగట్టుకుంది.

**టెస్టు క్రికెట్‌లో అత్యల్ప స్కోర్లు..**

(1) న్యూజిలాండ్ : 26 (ఇంగ్లండ్‌పై, 1955), (2) వెస్టిండీస్ : 27 (ఆస్ట్రేలియాపై, 2025)
(3) దక్షిణాఫ్రికా : 30 (ఇంగ్లండ్‌పై, 1896) (4) దక్షిణాఫ్రికా : 30 (ఇంగ్లండ్‌పై, 1924)
(5) దక్షిణాఫ్రికా : 35 (ఇంగ్లాండ్‌పై, 1899)

## 100వ టెస్టులో వరల్డ్ రికార్డు నమోదు చేసిన స్టార్క్

**- వెస్టిండీస్ పై ఆసీస్ ఘన విజయం**
**- 204 పరుగుల ఛేజింగ్ లో 27 పరుగులకే కుప్పకూలిన విండీస్**
**- 15 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టిన స్టార్క్**
**- అత్యంత వేగంగా 5 వికెట్లు తీసిన బౌలర్ గా రికార్డ్**



ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తన 100వ టెస్ట్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సృష్టించాడు.కింగ్‌స్టన్ సబీనా పార్క్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో స్టార్క్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 15 బంతుల్లోనే 5 వికెట్లు తీసి టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. గతంలో ఈ రికార్డు ఎర్నీ తోషాక్, స్టువర్ట్ బ్రాడ్, స్కాట్ బోలాండ్ (19 బంతులు) పేరిట ఉంది.ఈ టెస్టులో 204 పరుగుల లక్ష్యఛేదనతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన వెస్టిండీస్ 27 పరుగులకే కుప్పకూలింది. స్టార్క్ మొత్తం 6 వికెట్లు తీయగా, స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ సాధించడం విశేషం. ఆసీస్ బౌలర్ల ధాటికి విండీస్ ఇన్నింగ్స్ లో ఏడుగురు బ్యాట్స్ మెన్ డకౌట్ అయ్యారు. జస్టిన్ గ్రీవ్స్ చేసిన 11 పరుగులే ఆ జట్టులో అత్యధిక స్కోరు. ఇక ఇదే మ్యాచ్ తో స్టార్క్ టెస్టుల్లో 400 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన నాలుగో ఆసీస్ బౌలర్ గా నిలిచాడు.

## శ్రీ చరణికి 6వ ర్యాంక్

**- మెరుగైన షెఫాలీ, మంధాన ర్యాంకింగ్స్**
**- ఐసిసి టి20 మహిళల ర్యాంకింగ్స్ విడుదల**



ఇంగ్లండ్ పర్యటనలో అంచనాలకు మించి రాణించిన తెలుగమ్మాయి శ్రీ చరణి టి20 మహిళల ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న ఈ స్పిన్ కెరటం కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఇక టీమిండియా ఓపెనర్ షెఫాలీ వర్మ ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చింది. షెఫాలీ వర్మ(655పాయింట్లు) తొమ్మిదో స్థానం దక్కించుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 158.56 స్ట్రయిక్ రేటుతో 176 రన్స్ కొట్టింది. ఇక వైస్ కెప్టెన్ స్మృతి మంధాన(767పాయింట్లు) మూడో స్థానంలో నిలువగా.. రెండు స్థానాల్ని కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 14వ ర్యాంక్ సాధించింది. ఇంగ్లండ్ చరిత్రాత్మక టి20 సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రాధా యాదవ్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో నిలిచింది. పేసర్ అరుంధతీ రెడ్డి నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు మాత్రం షాక్ తగిలింది. టాప్-2లో ఉన్న ఆమె మూడో స్థానానికి పడిపోయింది. బేత్ మూనీ(ఆస్ట్రేలియా), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), మంధానా(భారత్), మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా), లారా వొల్వార్డ్(దక్షిణాఫ్రికా) టాప్-5 బ్యాటర్లు కాగా.. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సదియా ఇక్బాల్(పాకిస్థాన్), అనబెల్ సథర్‌లాండ్(ఆస్ట్రేలియా), దీప్తి శర్మ(భారత్), సోఫీ ఎకిల్‌స్టోన్(ఇంగ్లండ్), లారెన్ బెల్(ఇంగ్లండ్) ఉన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# సాధారణ పౌరులను నేరస్తులుగా మారుస్తున్నదేమిటి!?



మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. ఇండోర్ కు చెందిన సోనమ్, రఘువంశీల వివాహం జరగ్గా.. ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో ప్రియుడితో కలిసి సోనమ్ భర్తను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మీరట్‌లో సౌరభ్ రాజ్‌పుత్ అనే వ్యక్తిని అతని భార్య ముస్కాన్ రాస్తోగి, ఆమె ప్రియుడు సహిల్ శుక్లా హత్య చేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్‌లో దాచారు. కర్ణాటకలో ఒక మాజీ డీజీపీని ఆమె భార్య కత్తితో పొడిచి హత్య చేసింది. యూపీ, ఢిల్లీ, బిహార్ ఇలా చాలా రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. భార్యలను హత్య చేస్తున్న ఘటనలు దేశంలో నిత్యకృత్యంగానే మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీవితభాగస్వాముల మధ్య హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. అయితే ఇందులో 95 శాతానికి పైగా కేసుల్లో ఎవరికీ క్రిమినల్ రికార్డులు లేవు. 'పెళ్లి-విడాకులు' అనే రెండు అంశాలపై సామాజికంగా వస్తున్న ఒత్తిళ్లు సామాన్య పౌరులను సైతం నేరస్తులుగా మారుస్తున్నాయి. చిన్న సొల్యూషన్ తో పరిష్కారమయ్యే సమస్యలు కూడా హత్యల వరకు దారితీస్తున్నాయి.

**ఆందోళనకరంగా జీవితభాగస్వాముల హత్యలు**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం.. 2022లో భారతదేశంలో మొత్తం 28,522 హత్య కేసులు నమోదయ్యాయి, ఇందులో దాదాపు పది శాతానికి పైగా అంటే 2,821 కేసులు జీవిత భాగస్వామి లేదా భాగస్వామి ప్రోత్సాహంతోనే జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2022లో భార్యలు భర్తలను హత్య చేసిన, చేయించిన కేసులు 220కి పైగా నమోదయ్యాయి. అంటే ప్రతి 32 గంటలకు ఒక భర్త హత్యకు గురయ్యాడు. అదే సమయంలో భర్తలు భార్యలను హత్య చేసిన, చేయించిన కేసులు 270కి పైగా నమోదయ్యాయి. ఇందులో అదనపు కట్నం, వివాహేతర సంబంధాలు, ఇలా చాలా అంశాలు ఉన్నాయి. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన డేటాను ఇప్పటికీ ఎన్సీఆర్బీ విడుదల చేయలేదు. అయితే 2023, 2024లో కూడా జీవితభాగస్వాముల హత్యలకు సంబంధించి కేసులు వేల సంఖ్యలోనే నమోదై ఉంటాయని ఒక అంచనా.

**ఇష్టం లేకున్నా వివాహబంధంలోకి..**

భారతదేశంలో 85 నుంచి 90 శాతం ఆరెంజ్డ్ మ్యారేజెస్ జరుగుతున్నాయి. అందులో అబ్బాయి, అమ్మాయిల సమ్మతి తీసుకోకుండానే ఒత్తిడితో చేసిన వివాహాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. భారత సమాజంలో వివాహ బంధం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య కంటే.. కుటుంబాల మధ్య ఒప్పందంగా భావిస్తారు. కులం, మతం, ఆర్థిక స్థితి, సామాజిక స్థాయిని బట్టి జీవిత భాగస్వాములను ఎంపిక చేస్తారు. అయితే ఎక్కువ శాతం పెళ్లిళ్లలో జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ సంబంధిత వ్యక్తికి ఇవ్వరు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా కుటుంబంపై ఆధారపడి ఉండడంతో వారికి నిర్ణయం తీసుకునే ఫ్రీడమ్ తక్కువగా ఉంటున్నది. చాలా మంది తమ అభిప్రాయాన్ని చెప్పలేక.. కుటుంబ సభ్యుల ఒత్తిడికి లొంగి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఆ తర్వాత అందులో ఇమడలేక నిరాశ, ఒత్తిడి, ఒంటరితనానికి గురవుతున్నారు. తమ జీవితంపై నియంత్రణ కోల్పోయి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా మహిళలు గృహ హింసకు గురవుతున్న సందర్భాలు అనేకం. విడాకులు తీసుకోవడం తీవ్ర కష్టతరం కావడం, సమాజం ఏమంటుందోననే భావించి.. ఆ వివాహ బంధం నుంచి బయటపడలేక ఆందోళనకు గురవుతున్నారు. ఆ వివాహ బంధం నుంచి ఎలాగైనా బయటపడాలనే ఆతృతతో కొన్ని సార్లు కఠిన నిర్ణయాలు తీసుకొని నేరస్తులుగా మిగిలిపోతున్నారు.

**విడాకుల ప్రక్రియలో సంక్లిష్టతలు**

భారతదేశంలో విడాకుల ప్రక్రియలో అనేక సంక్లిష్టతలు ఉన్నాయి. పెండ్లి లాగే విడాకులు కూడా ఒక సుదీర్ఘమైన, సంక్లిష్టమైన, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియగా మారింది. ఇది విడిపోవాలనుకునే వారికి తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నది. అంతేకాకుండా విడాకులు తీసుకున్న మహిళలను సమాజం ఇప్పటికీ చిన్నచూపు చూస్తున్నది. విడాకుల తర్వాత మహిళలు ఒంటరితం, ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటున్నారు. మహిళలు విడాకులు ఇచ్చిన పురుషులను సైతం చాలా మంది చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా భరణం చెల్లించాల్సి వస్తుందనే కారణంతో భార్యలను పురుషులు హత్యలు చేస్తున్నారని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. 2022 డేటా ప్రకారం భారతదేశంలో విడాకుల రేటు ప్రతి వెయ్యి మందికి 0.01 (వెయ్యి మందికి ఒకరు) మాత్రమే. 2020లో ఇది 0.022 ఉండగా, 2021లో 0.077 మాత్రమే ఉన్నది. అయితే, ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో విడాకుల రేటు మెల్లమెల్లగా పెరుగుతున్నది. అయితే ఇతర దేశాలతో పోల్చుకుంటే ఈ శాతం చాలా తక్కువ. అయితే ఒక నివేదిక ప్రకారం 2023 వరకు దేశంలో సుమారు ఏడు లక్షలకు పైగా విడాకుల కేసులు వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. విడాకుల ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. ఈ జాప్యం వివాదాలను తీవ్రతరం చేసి హత్యల వరకు తీసుకెళ్తున్నదనే అభిప్రాయం సైతం వ్యక్తమవుతున్నది.

**ఇలా చేస్తేనే మంచిది..**

దేశంలో జీవిత భాగస్వాముల హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. వీటి నివారణకు కేంద్రంతోపాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. సమాజంలో మార్పు వస్తేనే ఈ హత్యల నివారణ సాధ్యమవుతుంది. ఒత్తిడితో కూడిన వివాహాలు భారతదేశంలో చట్టవిరుద్ధం. అయినా ఇది దేశంలో అమలు కావడం లేదు. ఇద్దరి సమ్మతి ఉంటేనే పెళ్లి చేయాలి. అబ్బాయి, అమ్మాయిల నిర్ణయాలను వారికుటుంబ సభ్యులు గౌరవించాలి. తమ అభిప్రాయాలను చెప్పుకునే స్వేచ్ఛ వారికి ఇవ్వాలి. వైవాహిక సంఘర్షణలు, ఒత్తిడి, లేదా హింసాత్మక ధోరణులను నివారించడానికి జంటలకు మానసిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. వివాహ బంధం నుంచి బయటకు వెళ్లిపోయినా.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలను అమలు చేయాలి. పెళ్లి చేయడానికి అయ్యే ఖర్చును భారీగా తగ్గించాలి. రిజిస్టర్డ్ మ్యారేజెస్ ను ప్రోత్సహించాలి. అంతేకాకుండా వివాహ బంధంలో ఇమడలేమని భావిస్తే.. ఆ బంధం నుంచి బయటపడేలా విడాకుల ప్రక్రియను సైతం సులభతరం చేయాలి. ముఖ్యంగా మహిళల కోసం, లీగల్ ఎయిడ్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలి. ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన న్యాయ సహాయం అందించాలి. విడాకులను ఒక వైఫల్యంగా చూడడం కంటే.. ఒక వ్యక్తి స్వాతంత్ర్యం, ఆరోగ్య కరమైన జీవితానికి అవసరమైన ఎంపికగా సమాజంలో ప్రచారం చేయాలి.



**-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464**

# పౌరసత్వంతో ముడిపెట్టొద్దు

## - సుప్రీం మార్గదర్శకాలతోనే ఓటర్ల జాబితా సవరణలు
## - కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి వినతి - సిఇసి, ఇసిలతో నేతల భేటీ

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 15**

పౌరసత్వ ధ్రువీకరణతో ముడిపెట్టి ఓటర్ల జాబితా సవరణ చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని తెలుగుదేశం పార్టీ (టిడిపి) కోరింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే సవరణలు ఉండాలని సూచించింది. ఈ విషయంలో ప్రస్తుతం బీహార్‌లో చేపడుతున్న తరహాలో దేశవ్యాప్తంగా చేయతల పెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు విధానపరమైన స్పష్టత ఉండాలని కోరింది. ఎస్ఐఆర్ అనేది పౌరసత్వ ధ్రువీకరణకు సంబంధించిన ప్రక్రియ కాదనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో స్పష్టంగా తెలియజేయాలని సూచించింది. ఎస్ఐఆర్ ఉద్దేశమేంటో స్పష్టమైన నిర్వచనం ఇవ్వాలని, సవరణలకు స్పష్టమైన నిర్వచనం, ఈ ప్రక్రియను మార్పులు, చేర్పులకే పరిమితం చేయాలని విన్నవించింది.

అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను వీలైనంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలని కూడా టిడిపి కోరింది. ఎన్నికల జాబితా విషయంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని, ఈ ప్రక్రియలన్నీ పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కోరింది. న్యూఢిల్లీలోని నిర్వచన్ భవన్‌లో కేంద్ర ఎన్నికల కమిషనర్ (ఇసిఐ) జ్ఞానేష్ కుమార్‌తో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కూడిన నేతల బృందం మంగళవారం సమావేశమైంది. పల్లాతో పాటు ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయులు, డి ప్రసాదరావు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కూన రవికుమార్, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి టి జ్యోత్స్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగు పేజీల లేఖను ఇసిఐకి టిడిపి




బృందం అందజేసింది. ఎన్నికల జాబితా నిర్వహణను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకతను పెంపొందిం చడం లక్ష్యంగా పలు సంస్కరణలను ప్రతిపాదిం చింది. కేంద్ర కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ద్వారా థర్డ్ పార్టీ ఆడిట్‌లు, ఎఐ ఆధారిత డూప్లికేషన్ల తొలగింపు, ఆధార్ ఆధారిత ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డు (ఇపిఐసి) నంబర్లను ఆధార్ ఆధారితంగా ధ్రువీకరించడం, ఓటరు ఫిర్యాదు ట్రాకింగ్ కోసం మెరుగైన పబ్లిక్ డాష్‌బోర్డ్ ఏర్పాటు వంటి పలు సూచనలను టిడిపి తన లేఖలో సూచించింది.

**జాతీయ సగటు కంటే ఏపిలో పోలింగ్ ఎక్కువ**

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ సగటు ఓటింగ్ కంటే పోలింగ్ శాతం అధికంగా నమోదైందని, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఏపిలో 81.86 శాతం ఓటింగ్ నమోదైందని, జాతీయ సగటు 65.79 శాతం కంటే చాలా ఎక్కువ అని టిడిపి పేర్కొంది. సాంకేతికతతో కూడిన ఓటరు జాబితా సవరణలు ప్రజాస్వామ్య వ్యవస్థలో చాలా కీలకమని తెలిపింది. ఎన్నికల అధికారుల కఠినమైన జవాబుదారీతనం, బ్లాక్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒలు)/ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఈఆర్‌వోలు) తప్పనిసరి రొటేషన్ చేపట్టాలని, అలాగే వలస ప్రజల కోసం ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్‌లు నిర్వహించాలని టిడిపి సూచించింది.

ఏపిలో 2029 వరకు అసెంబ్లీ ఎన్నికలు జరగవని, అందువల్ల ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితాలు న్యాయంగా, సమగ్రంగా, పారదర్శకంగా అప్‌డేట్ చేయడానికి అవకాశం లభిస్తుందని టిడిపి పేర్కొంది. ఈ ప్రక్రియను రాష్ట్రంలో వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరింది.




# బనకచర్లపై చర్చకు నో

## - సిఎంల సమావేశ అజెండా సవరించండి
## - కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వ లేఖ

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, జూలై 15**

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఈ నెల 16న ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బనకచర్లను అజెండాగా చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బనకచర్లపై చర్చిం చాల్సిన అవసరం లేనేలేదని, వెంటనే అజెండాను సవరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖ రాశారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలను ప్రభుత్వం ఈ లేఖలో ప్రస్తావించింది. ఢిల్లీలో బుధవారం జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ అజెండాను కేంద్రానికి పంపించింది. దీనిపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం%౫% కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటికే కృష్ణా నదిపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టిఎంసిల నీటి కేటాయింపుతోపాటు ఎబిఐపి సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టిఎంసిల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో తెలంగాణ ప్రభుత్వం అజెండా ప్రతిపాదనలను పంపించింది. 'బనకచర్లపై జిఆర్‌ఎంబి, సిడబ్ల్యుసి తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఇప్పటి వరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులూ లేవు. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదు' అని ఈ లేఖలో పేర్కొంది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అందులో ప్రస్తావించింది. ఇప్పటికే ఎపి ప్రభుత్వం సమర్పించిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఇఎసి తిరస్కరించిన విషయాన్ని ఈ లేఖలో ఉటంకించింది. ప్రీ ఫిజిబులిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల సంఘానికి సిఎస్ విజ్ఞప్తి చేశారు. డిపిఆర్ సమ ర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఆంధ్రప్రదేశ్‌ని అడ్డుకోవాలని కోరారు. రెండు రాష్ట్రాల సిఎంల సమావేశంలో గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేయాలని, తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను అజెండాలో చేర్చాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )